హైదరాబాద్‌ను ఫార్మా రంగంలో ల్యాండ్ మార్క్‌గా మార్చాలి

సీనియర్ ఫార్మా అధ్యక్షుడు టీవీ నారాయణ

మాదాపూర్, అక్టోబర్ 24: హైదరాబాద్‌ను ఫార్మా రంగంలో ఓ ల్యాండ్ మార్క్‌గా మార్చడానికి అందరు చేతులు కలపాలని సీనియర్ ఫార్మా అధ్యక్షుడు టీవీ నారాయణ అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఫార్మా ఇండియా ఎక్స్ పో– 2024 కార్యక్రమాన్ని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి, బిస్టన్ విశ్వ విద్యాలయం ఏఐ శాస్త్రవేత్త వై. శ్రీధర్‌రెడ్డిలతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ... ప్రపంచంలోనే ఫార్మా కంపెనీల క్యాపిటల్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడానికి అడుగులు పడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దేశీయ ఫార్మా రంగం వార్షిక టర్నోవర్ 6500 కోట్ల డాలర్లు ఉండగా, 2047 నాటికి 45 వేల కోట్ల డాలర్లకు చేరుతుందన్నారు. ఫార్మా రంగంలో మరింత అభివృద్ధిని సాధించాలంటే పర్యావరణ హిత పరిశ్రమలను నెలకొల్పాల్సిన అవసరం కూడా ఉందన్నారు. ఇందులో 250 స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం జరిగింది.

ప్రభుత్వ భూములు కబ్జాకు పాల్పడితే చర్యలు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



తుక్కుగూడలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం అక్టోబర్ 24 : ప్రభుత్వ భూములను కబ్జాకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని తుక్కుగూడలో కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెల రోజుల్లో నెరవేర్చుతానని చెప్పి.. ఎందుకు నెరవేర్చలేదో సమాధానం చెప్పాలన్నారు. కల్యాణ లక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం ఇస్తానని చెప్పి.. ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని అన్నారు. రైతు రుణమాఫీ, రైతు బంధు, మహిళలకు ఇస్తన్న రూ.2500లు ఎప్పుడు ఇస్తారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బాల్య వివాహాలను నిర్మూలించడానికే కల్యాణ లక్ష్మి పథకాన్ని తీసుకువచ్చిందని, 18 సంవత్సరాలు నిండిన వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని చెప్పడంతో చాలా మంది అమ్మాయిలకు 18 ఏండ్లు నిండిన తర్వాత పెండ్లీలు చేస్తున్నారని తెలిపారు. అప్పటినుంచి అమ్మాయిలు బాగా చదువుకుంటున్నారని తెలిపారు. ఫాక్స్‌ఖాన్ లాంటి కంపెనీలు రావడంతో తుక్కుగూడ ప్రాంతంలో ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో తుక్కుగూడ మరో హైటెక్ సిటీగా మారబోతుందన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ చేసిన కృషితోనే అనేక కంపెనీలు ఈ ప్రాంతానికి వచ్చాయన్నారు. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి కోసం గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.270 కోట్లు నిధులను నిలిపివేశారని, దీంతో పనులు మధ్యంతరంగా ఆగిపోయాయన్నారు. కార్యక్రమంలో చైర్మన్ కాటేకార్ మధుమోహన్, మహేశ్వరం తాసీల్దార్ సైదులు, వైస్ చైర్మన్ భవానీ వెంకట్ రెడ్డి, కమిషనర్ వెంకట్ ట్రామ్ రెడ్డి, కౌన్సిర్లు రవినాయక్, యాదగిరిరెడ్డి, సుమన్, తేజస్వీని శ్రీకాంత్ గౌడ్, విలాస్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మయ్య, సల్మాన్ రాజు పాల్గొన్నారు.

రావిర్యాల చెరువు పరిశీలన

మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ ఒక విజన్‌తో చెరువులను అభివృద్ధి చేయించారని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. తుక్కుగూడలో ఉన్న రావిర్యాల చెరువును గురువారం ఆమె పరిశీలించారు. చెరువు చుట్టూ తిరిగి సుందరీకరణ పనులను పరిశీలించారు. చెరువు కట్టపై ఇంకా చేయవలసి న పనుల గురించి అధికారులతో చర్చించి..సుందరీకరణ మ్యాప్‌ను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో మిషన్ కాకతీయ పథకం ద్వార చెరువుల్లో పూడిక తీయడం జరిగిందన్నారు. గతంలో రావిర్యాల చెరువును సుందరీకరణ చేయడానికి రూ.7 కోట్లు కేటాయించిందని అని అన్నారు. గౌడన్నల కోసం చెరువు కట్టపై 700 ఈత చెట్లు నాటించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకట్ ట్రామ్, ఏఈ శివకుమార్ రెడ్డి, కౌన్సిలర్ రవినాయక్, సుమన్, లక్ష్మయ్య, సామెల్ రాజ్, బాట సురేశ్, తదితరులు ఉన్నారు.

కేసీఆర్‌ను కలిసిన ముఠా గోపాల్, పల్లా

ముషీరాబాద్, జనగామ ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత రాకేశ్ రెడ్డి గురువారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిశారు. ఎర్రవెల్లిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ కుమారుడు జయసింహాకు సీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. – హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ)

ఓయూను సందర్శించిన వర్సిటీ బృందం

అమెరికాలోని ఇల్లినాయిస్‌లో ఉన్న గవర్నర్స్ స్టేట్ యూనివర్సిటీ బృందం గురువారం ఉస్మానియా యూనివర్సిటీని సందర్శించింది. బృందం సభ్యులు ఓయూ వీసీ ప్రొఫెసర్ మొలుగరం కుమార్, ఇతర అధికారులతో సమావేశమైంది. సమావేశంలో గవర్నర్స్ స్టేట్ వర్సిటీ తరపున డైరెక్టర్ ఆఫ్ గ్రాడ్యుయేట్ అడ్మిషన్స్ అండ్ రిటెన్షన్ జేసన్ వెగ్నోన్, డీన్ డాక్టర్ సోనియా దాల్మియా, ఆఫీస్ ఆఫ్ ఇంటర్నేషనల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రాబర్ట్ మోర్లే పాల్గొనగా ఓయూ తరపున వీసీతో పాటు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు. – ఉస్మానియా యూనివర్సిటీ

గొలుసుకట్టు చెరువుల వ్యవస్థను పరిరక్షించాలి

వాటర్‌ఉమెన్, యాక్టివిస్ట్ డా.మాన్సీబాల్ భార్గవ

హైడ్రా కార్యాలయంలో కమిషనర్ రంగనాథ్‌తో సమావేశమైన మాన్సీలాల్ భార్గవ

సిటీబ్యూరో, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ): చెరువుల పునరుద్ధరణలో భాగంగా నాలాలు సరిగ్గా ఉంటే వరదనీరు చెరువుకు సాఫీగా చేరుతుందని, ఆ దిశగా అనుసంధానం ఉన్నప్పుడే చెరువుల గొలుసుకట్టు వ్యవస్థ బాగుంటుందని వాటర్ ఉమెన్, యాక్టివిస్ట్ డా.మాన్సీబాల్ భార్గవ అన్నారు. గురువారం హైడ్రా కార్యాలయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో డా.మాన్సీబాల్ భార్గవ సమావేశమయ్యారు. చెరువులు, నాలాల పరిరక్షణతో వాటికి పునరుజ్జీవనం కల్పించడానికి స్వచ్ఛంద సంస్థలు, లేక్‌మ్యాన్స్, జలవనరుల అభివృద్ధికి కృషిచేసిన పరిశోధకులు, నిపుణులతో హైడ్రా వరుసగా సమావేశాలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో నగరంలో ఉన్న చెరువుల పరిస్థితిపై వాటికి పునరుజ్జీవనం కల్పించడానికి హైడ్రా తీసుకుంటున్న చర్యలను రంగనాథ్ ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా డా.మాన్సీబాల్ భార్గవ మాట్లాడుతూ.. శరీరానికి నాడీ వ్యవస్థ ఎంత ముఖ్యమో.. చెరువులకు నాలా వ్యవస్థ కూడా అంతే ముఖ్యమన్నారు. భారీ వర్షాల కారణంగా బెంగళూరులోని చాలా ప్రాంతాలు జలమయమయ్యాయని, అటువంటి పరిస్థితి హైదరాబాద్‌లో తలెత్తకూడదంటే చెరువుల అనుసంధానం, గొలుసుకట్టు చెరువులు, నాలావ్యవస్థ బాగుండాలని సూచించారు. ఇందులో భాగంగా డా.మాన్సీబాల్ భార్గవ సహజసిద్ధంగా చెరువులకు పునరుజ్జీవనం కల్పించే పద్ధతులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో హైడ్రా అధికారులు పాల్గొన్నారు

పది రూపాయల బిళ్లపై అపోహలు వద్దు

వాటిని అధికారికంగా వినియోగించవచ్చు

సెంట్రల్ బ్యాంక్ జోనల్ హెడ్ ధారాసింగ్

సిటీబ్యూరో, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ) : పదిరూపాయల బిళ్లలపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, వాటిని అన్నిలావాదేవీల్లో వినియోగించుకోవచ్చని సెంట్రల్ బ్యాంక్ జోనల్ హెడ్ ధారాసింగ్ అన్నారు. హైదరాబాద్ కోఠిలోని కరెన్సీ చెస్ట్ బ్రాంచ్‌లో కాయిన్ మేళా పేరిట పది రూపాయల నాణేలపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌బీఐ విడుదల చేసిన ఈ నాణేలను ఎక్కడైనా వినియోగించుకోవచ్చని, వీటిపై ఎలాంటి నిషేధం లేదన్నారు. నాణేలతో అన్ని రకాల ఆర్థిక లావాదేవీలను నిర్వహించుకోవచ్చన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేలా ఈ కాయిన్ మేళా ఏర్పాటు చేసినట్లుగా సెంట్రల్ బ్యాంక్ రీజనల్ హెడ్ రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ కరెన్సీ చెస్ట్ బ్రాంచ్ మేనేజర్ వివేకానంద, ఏజీఎంలూ సత్యవాణి, కనకరాజ్, గుల్షన్ కుమార్‌తోపాటు పలువురు బ్యాంక్ సిబ్బంది ఉన్నారు.

వేలకోట్ల అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

అభివాదం చేస్తున్న జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, గుజ్జ సత్యం, తదితరులు

కాచిగూడ, అక్టోబర్ 24: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్ర సంక్షోభంలో ఉందని, ప్రభుత్వం తీసుకువచ్చిన రూ.1,80,000 వేల కోట్ల అప్పులపై సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే శ్వేతపత్రాన్ని విడుదల చేసి.. నిజాయితీని నిరూపించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో బీసీ కుల సంఘాల నాయకులతో గురువారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా బీసీ జేఏసీ చైర్మన్‌గా పెంటం ధనుంజయను నియమిస్తూ, నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను రూ.20 వేల వరకు పెంచాలని, విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నీల వెంకటేశ్, నంద గోపాల్, అనంతయ్య, ఉదయ్, నరేందర్, వి.రమేశ్, వీరన్న, యాదయ్య, విజయ్ యాదవ్, జి.వెంకన్న, నిఖిల్ పాల్గొన్నారు.

యశోదలో తుర్కపల్లివాసికి అరుదైన శస్త్ర చికిత్స

పూర్తిగా విరిగిపోయిన చేతిని అతికించిన వైద్యులు

రామసేవక్‌తో కలిసి శస్త్ర చికిత్స వివరాలను వెల్లడిస్తున్న వైద్యులు

మేడ్చల్, అక్టోబర్ 24 : యశోద ఆస్పత్రిలో శామీర్‌పేట మండలం, తుర్కపల్లి వాసికి అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. కంపెనీలో పనిచేస్తూ పూర్తిగా విరిగిపోయి వేరైన చేతిని యథావిధిగా అతికించారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం ఆస్పత్రి డాక్టర్లు మేడ్చల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తుర్కపల్లి పారిశ్రామికవాడలోని ఒక కంపెనీలో రామ్ సేవక్(21) విధులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు చేయి మణికట్టు వద్ద విరిగిపోయి వేరైంది. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో రామ్‌సేవక్‌ను, విరిగిపోయిన చేతిని సాయంత్రం 6 గంటల వరకు సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అవసరమైన పరీక్షలు నిర్వహించి, చేతిని ఫ్రీజర్‌లో ఉంచారు. ప్లాస్టిక్ అండ్ కాస్మెటిక్ సర్జన్ డాక్టర్ జమ్ముల శ్రీనివాస్, అర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ బ్రిజేష్ కిడియార్, అనస్తీషియా నిపుణుడు ప్రతీక్, అత్యవసర వైద్యుడు డాక్టర్ అలీమ్, నర్సింగ్ సిబ్బంది జ్యోత్స్న, వరలక్ష్మి బృందంగా ఏర్పడి, రాత్రి 8 గంటలకు చికిత్స ప్రారంభించారు. 12 గంటల పాటు శస్త్ర చికిత్స నిర్వహించి, అతికించారు. శస్త్ర చికిత్స విజయవంతమై రామ్‌సేవక్ వేలును కదిలించడం ప్రారంభించాడు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన యూఎస్‌ఏ బృందం

అంగన్‌వాడీ కేంద్రంలో యూఎస్ఈ ప్రతినిధి బృందం

ఉప్పల్, అక్టోబర్ 24 : బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ యూఎస్ఏలోని వాషింగ్‌టన్ స్టేట్‌కు చెందిన ప్రతినిధులు, ఎన్ఐఎన్ ప్రతినిధులు గురువారం నాచారం ఇందిరానగర్–1 అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించే కార్యక్రమాలు, అందించే పోషక ఆహారం, ప్రీస్కూల్ కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు. చిన్నారుల పోషణస్థితి, ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యూట్రిషన్ డైరెక్టర్ మీటు కపూర్, జోనాదశ గోరెస్టెయిన్, రుచిక సచిదేవ, హెలెన్ ఓల్సేన్, సునీతా కృష్ణన్, పూజ, అర్లప్ప, నర్సింహులు, ప్రాజెక్టు సీడీపీఓ స్వాతి, ఉప్పల్ సెక్టార్ సూపర్‌వైజర్ వెంకటరమణ, టీచర్లు స్వాతి, సహాయకులు బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

జార్జి, జంపాల స్ఫూర్తితో ఫాసిజానికి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

ప్రముఖ శాస్త్రవేత్త, కవి గౌహర్ రజా

ఘనంగా పీడీఎస్‌యూ అర్థశతాబ్దోత్సవ సభ

ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో పీడీఎస్‌యూ అర్థ శతాబ్దోత్సవ సభకు ముందు జెండాను ఆవిష్కరిస్తున్న మొదటి అధ్యక్షుడు గురువారెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 24: జార్జిరెడ్డి, జంపాల స్ఫూర్తితో ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని ప్రముఖ శాస్త్రవేత్త, కవి గౌహర్ రజా పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నదని అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆవిర్భవించి యాభై ఏళ్లు అవుతున్న సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియం లో అర్థ శతాబ్దోత్సవ సభను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆర్ట్స్ కళాశాల నుంచి ఠాగూర్ ఆడిటోరియం వరకు సాంస్కృతిక కార్యక్రమాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంస్థ చిహ్నమైన బిగిపిడికిలి జెండాను పీడీఎస్‌యూ మొదటి అధ్యక్షుడు గురువారెడ్డి ఎగరవేశారు. ఆ తరువాత నిర్వహించిన సభలో విద్యార్థి అమరవీరులకు నివాళుర్పించారు. సభకు ముఖ్య అతిథిగా గౌహర్ రజా హాజరయ్యారు. ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ దేశ ప్రజలను విభజించి, విద్వేష రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రంలో పీడీఎస్ యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ప్రదీప్, ప్రొఫెసర్ కాశీం, వెంకటేశ్వరరావు, ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, డాక్టర్ ఉపేందర్, గోపీకృష్ణ, డాక్టర్ దుబ్బ రంజిత్, అనురాధ, పీడీఎస్‌యూ నాయకులు మహేశ్, మధు, భూషణం, రాజశేఖర్, శ్రీకాంత్, నాగరాజు, భాస్కర్, వినోద్‌కుమార్, వివి ధ రాష్ట్రాల విద్యార్థి నాయకులు అమన్‌దీప్‌సింగ్, రోహిత్ సోలంకి, ఆత్రేయ మండల్, మున్నా కుమార్, కన్హూ చరణ్, నవాజ్‌ఖాన్, అన్బు, సర్వార్ జహన్, సరోవర్, సూర్య, తదితరులు పాల్గొన్నారు.

టోర్నీ ప్రారంభానికి ఆహ్వానం

టీడీసీఏ, డీఏబీ సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 4 నుంచి ఇంక్రిడెబుల్ ఇండియా తెలంగాణ బ్లైండ్ చాలెంజర్స్ కప్ టోర్నీ ప్రారంభానికి ముఖ్య అతిథిగా డీజీపీ జితేంద్రను గురువారం ఆహ్వానిస్తున్న టీడీసీఏ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, డీఏబీ ప్రధాన కార్యదర్శి శ్రీశైలం – హైదరాబాద్, ఆట ప్రతినిధి

సహస్ర, సాహిల్‌కు స్వర్ణాలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్ఎఫ్ఏ) చాంపియన్‌షిప్‌లో భాగంగా జరుగుతున్న క్యారమ్స్ పోటీల్లో బాలికల అండర్–14 విభాగంలో సహస్రరెడ్డి స్వర్ణ పతకంతో మెరిసింది. బాలుర అండర్–18 విభాగంలో సీఆర్పీఎఫ్ స్కూల్‌కు చెందిన సాహిల్ చాంపియన్‌గా నిలిచాడు. వాలీబాల్‌లో విజ్ఞాన్ బ్రో ట్రీస్కూల్ టైటిల్ దక్కించుకుంది. స్విమ్మింగ్ అండర్–14 బాలికల 100మీటర్ల బటర్‌ఫ్లై ఫ్రీస్టయిల్‌లో శివానీ కర్రా స్వర్ణం సాధించగా, బాలుర అండర్–18లో జోర్డాన్ డొమినిక్ టాప్‌లో నిలిచాడు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో షూటింగ్ పోటీలు జరుగుతుండగా, కబడ్డీ పోటీలు యూసుఫ్‌గూడ స్టేడియంలో మొదలయ్యాయి.

పటాకుల దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

- లేకపోతే అనుమతిలేదు..
- రిటైల్ షాపులకు రూ.11వేలు, హోల్‌సేల్ షాపులకు 66వేల ఫీజు
- నిబంధనల మేరకు ఏర్పాటు చేసుకోవాలి
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : బాణాసంచా (పటాకుల షాపులు) విక్రయ దుకాణదారులు తప్పనిసరిగా జీహెచ్ఎంసీ నుంచి తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని, లైసెన్స్ లేకుండా షాప్ పెట్టుకోవడానికి అనుమతి లేదని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి స్పష్టం చేశారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజు రిటైల్ షాపులకు రూ.11 వేలు, హోల్‌సేల్ షాపులకు రూ.66 వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. బాణాసంచా దుకాణాల నిర్వాహకులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్ పొంది నిబంధనల మేరకు దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పటాకుల దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారంతా నిర్ణీత ఫీజును చెల్లించి జీహెచ్ఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుందని అన్నారు. తాత్కాలిక ట్రేడ్ ఐడెంటిఫికేషన్ నంబర్ కోసం సిటిజన్ సర్వీస్ సెంటర్, జీహెచ్ఎంసీ వెబ్‌సైట్ (www.ghmc.gov.in) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డిమాండ్ డ్రాఫ్ట్, డెబిట్/క్రెడిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్ ద్వారా ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించవచ్చన్నారు. అదేవిధంగా తమ గుర్తింపు రుజువుకు ఆధార్ కార్డు, పాన్ కార్డు కాఫీ ఇవ్వాలని కోరారు. బాణాసంచా షాపులను ఫుట్‌పాత్‌లు, జనావాసాల మధ్య ఏర్పాటు చేయరాదని తెలిపారు. కాలనీ, బస్తీలకు దూరంగా ఓపెన్ గ్రౌండ్‌లో, పెద్దహాల్‌లో తగిన ఫైర్ సేఫ్టీతో షాపులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే మంటలను ఆర్పడానికి వీలుగా అగ్నిమాపక నిరోధక పరికరాలు అందుబాటులో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. దుకాణాలకు దగ్గరగా ఎట్టి పరిస్థితుల్లోనూ బాణాసంచా కాల్చకూడదని, షాపులో ఏర్పాటు చేసే లైట్లు ఇతరత్రా కరెంటు పరికరాలకు నాణ్యమైన విద్యుత్ వైర్‌ను వినియోగించాలని సూచించారు. స్టాల్‌లో ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగినట్లయితే స్టాల్ హోల్డర్‌దే బాధ్యతని, చట్టపరమైన చర్యలకు బాధ్యుడని తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్‌లో స్పష్టంగా పేర్కొనడం జరుగుతుందన్నారు.

పీసీబీ నిబంధనలు తప్పనిసరి ..

తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సూచించారు. సుప్రీం కోర్టు, హైకోర్టు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు టైం టు టైం జారీ చేసే అన్ని ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలని తెలిపారు. ఫైర్ క్రాకర్స్ అయిన సిరీస్ క్రాకర్స్, లడీస్ తయారీ, అమ్మకాలు, వినియోగించడం నిషేధించడం జరిగిందని, వాటి అమ్మకాలకు అనుమతించరని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ ఆక్ట్ 1955, న్యాయస్థానాలు, పీసీబీ, ప్రభుత్వ ఉత్తర్వులు, మార్గదర్శకాలను ఉల్లంఘించినట్లయితే తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ రద్దు చేయడం జరుగుతుందని కమిషనర్ స్పష్టం చేశారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

సిటీబ్యూరో, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : ఎస్ఆర్‌డీపీ ద్వారా చేపట్టిన అసంపూర్తిగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి ఆయన గురువారం పలు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫలక్‌నుమా ఆర్వోబీ పనులు వేగవంతంగా పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫలక్‌నుమా ఆర్వోబీ, నల్గొండ ఎక్స్‌రోడ్ ఫ్లై ఓవర్, ఉప్పల్ ఫ్లై ఓవర్ పనుల ప్రగతిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కమిషనర్ వెంట ప్రాజెక్టు సీఈ దేవానంద్, ఎల్బీనగర్, చార్మినార్ జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, వెంకన్న, ఎల్బీనగర్ జోన్ ప్రాజెక్టు ఈఈ రోహి ణి, ఫలక్‌నుమా, సంతోష్‌నగర్, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్లు అరుణకుమారి, శైలజా, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫిట్ ఇండియా ఫ్రీడం రన్

సిటీబ్యూరో, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లోని నేషనల్ శాంపిల్ సర్వే ఆఫ్ ఆఫీస్ ఆధ్వర్యంలో నేడు ఫిట్ ఇండియా ఫ్రీడం రన్ నిర్వహించనున్నారు. నెక్లెస్ రోడ్డులో ఉదయం 7.30గంటలకు ప్రారంభమయ్యే ఈ ఫ్రీడం రన్‌లో సిటీ ప్రజలు పాల్గొనాలని సూచించారు. పటిష్ట భారత్ నిర్మాణంలో ఆరోగ్యమే కీలకమని, ఆరోగ్యకరమైన జీవన విధానాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా ఎన్ఎస్ఎస్‌వో డిప్యూటీ డైరెక్టర్ శివపార్వతి రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

ఉత్సాహంగా డీఆర్ఎస్ స్పోర్ట్స్ మీట్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కొంపల్లిలోని డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా సాగుతున్నది. గురువారం మొదలైన మీట్‌లో టీటీ, స్కేటింగ్, స్విమ్మింగ్, టెన్నిస్, కరాటేలో విద్యార్థులు ప్రతిభ చాటారు. పోటీల తొలి రోజు స్పీడ్ స్కేటింగ్ బాలుర అండర్–9 విభాగంలో అగస్త్య అగ్రస్థానంలో నిలువగా, బాలికల అండర్–11లో నిహిర ఆకట్టుకుంది. వేర్వేరు విభాగాల్లో మైఖేల్, బ్రహ్మణి, కుశాల్, మోక్షజ్ఞ, ఆద్విక్, రవి సత్మిక రాణించారు.